పిఎం జన్మన్ గృహాల పరిశీలన

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని పీఎం జన్మన్ పథకం కింద నిర్మిస్తున్న గృహాలు త్వరితగతిన పూర్తి చేయాలని మండల హౌసింగ్ ఏఇ .నాగేశ్వరరావు లబ్ధిదారులకు సూచించారు. మండలానికి మారుమూల కివర్ల పంచాయతీ పరిధి నక్కులు మామిడి గ్రామంలో గురువారం సందర్శించారు. అనంతరం పివిటీజీ లబ్ధిదారులు నిర్మిస్తున్న గృహాలను పరిశీలించారు. లబ్ధిదారులు మాట్లాడుతూ, సుమారు నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డు సౌకర్యం లేకపోవడంతో సామగ్రి మోసుకొని తరలించవలసి వస్తుందని, దీంతో పనులు ముందుకు సాగడం లేదని తెలిపారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ, పనులు ఆలస్యమైతే బిల్లులు చెల్లిచడం కుదరదని, గృహాలు పూర్తి చేసిన వారికే విడతల వారీగా చెల్లించడం జరుగుతుందని అన్నారు.

పరిశీలిస్తున్న ఎఇ

గోదావరి, శబరి నదుల ఉగ్రరూపం

- రెండో ప్రమాద హెచ్చరిక దాటి ప్రవాహం
- జల దిగ్బంధనంలో పలు గ్రామాలు
- నిలిచిన రాకపోకలు
- మునిగిన పంట పొలాలు

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

భారీ వర్షాలకు, ఎగువ నుండి వస్తున్న వరద ప్రవాహానికి గోదావరి, శబరి నదులు ఉగ్రరూపం దాల్చాయి. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం బుధవారం అర్ధరాత్రి 48 అడుగులకు చేరుకోగా రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. గురువారం సాయంత్రానికి 51.90 అడుగుల వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. దిగువకు 13.66.788 క్యూసెక్కుల వరద నీరు దిగువక విడుదలవుతుంది. చింతూరు వద్ద శబరి నది బుధవారం కొంతమేర నిలకడగా ఉండి మరల గురువారం నాటికి 32 అడుగుల నుండి 35 అడుగులకు చేరింది. దీంతో విలీన మండలాల్లోని పలు గ్రామాలు జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయి. రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

చింతూరు మండలంలో మునిగిపోయిన ఆంధ్రా-ఒడిశా జాతీయ రహదారి

చింతూరు : గత పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఏజెన్సీ మన్య ప్రాంతంలో శబరి, దాని ఉపనదులు సీలేరు, సోకిలేరు, చంద్రవంక, కోయుగూరు, చిడుమూరు కొండవాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. గోదారి ఎగువ ప్రాంతాలైన తెలంగాణ బ్యారేజీలు కాలేశ్వరం, మంచిర్యాల, లక్ష్మీ బ్యారేజ్, పేరూరు, ఏటూరునాగారం, దుమ్ముగూడెం, చత్తీఘడ్‌లోని ఇంద్రావతి నది ప్రవాహంతో పాత గూడెం వద్ద పరవళ్ళు తొక్కుతుంది. చింతూరు వద్ద శబరి నది గురువారం నాటికి 32 అడుగుల నుండి 35 అడుగులకు చేరింది. సుకుమా వద్ద శబరి నది తగ్గటంతో ఆ వరద నీరు కుంట చింతూరు శబరి నదిలో శబరి నది ప్రవాహం పెరిగింది. కూనవరం వద్ద శబరి నది ప్రవాహం ప్రమాదకర స్థాయిలో పెరగడంతో వీఆర్.పురం కూనవరం మధ్య ఉన్న బ్రిడ్జి లెవెల్‌కు వరద నీరు చేరడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. బుధవారం రాత్రి నుండి గురువారం వరకు వరద ప్రవాహం పెరగడంతో జాతీయ రహదారి ముంపుకు గురై వందల స్థాయిలో వాహనాలు రోడ్లపై నిలిచిపోయాయి..

విఆర్.పురం : శబరి, గోదావరి వరద ప్రవాహం పెరగడంతో మండలంలోని వడ్డిగూడెం, వడ్డిగూడెం కాలనీ, రామవరం, రామవరంపాడు, అడివి వెంకన్నగూడెం, సృష్టివారి గూడెం, చింతరేగుపల్లి, కన్నాయిగూడెం, శ్రీరామగిరి, జీడి గొప్ప పంచాయతీల్లో గల శ్రీరామగిరి, సీతంపేట, కోటారు గొమ్ము, జీడిగుప్ప, చొక్కనపల్లి ములక పల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి. గృహాల చుట్టూ వరద నీరు చేరటంతో ఆయా గ్రామస్తులు గ్రామాలను విడిచి ఎత్తైన ప్రాంతంలో రోడ్డుపైనా, అడవిలోనూ గుడారాలు వేసుకొని అక్కడికి చేరుకున్నారు. వడ్డిగూడెం, వడ్డిగూడెం కాలనీల ప్రజలు రేఖపల్లిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు, వారు సొంతంగా నిర్మించుకున్న గుడారాలకు చేరారు. వారికి నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని కిరోసిన్, దోమతెరలు అందించలేదు.

ఎటపాక మండలం రాయనపేట వద్ద జాతీయ రహదారిపై నిలిచిపోయిన లారీలు

ఎటపాక : గోదారి వరద ఉధృతితో మండలంలోని పలుచోట్ల రహదారుల పైకి నీరు చేరింది. రాయన్నపేట వద్ద జాతీయ రహదారిపై వరదనీరు చేరడంతో అంతరాష్ట్ర సర్వీసులను నిలిపివేశారు. చత్తీస్‌ఘడ్, ఒడిస్సా వెళ్లే లారీలు రాయనపేట- గుండాల మధ్య నిలిపివేశారు. మరోవైపు వరదపోటుతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోగా, మరికొన్ని గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పంట పొలాలు నీట మునిగాయి. నెల్లిపాక, నందిగామ, మురుమూరు, వీరాయిగూడెం, గట్టు గూడెం గ్రామాలకు వెళ్లే రహదారులపైకి వరద నీరు చేరడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్ బ్లాక్ పాయింట్ల వద్ద బోటు ఏర్పాటు చేస్తున్నట్లు తహశీల్దారు సుబ్బారావు తెలిపారు. ఎవరు వరద నీటిలోకి వెళ్ళొద్దని, రహదారులు దాటే ప్రయత్నం చేయొద్దని హెచ్చరించారు.

కూనవరం : ముంపునకు గురైన కూనవరంలోని గిన్నెల బజార్, ఉదయ భాస్కర్ కాలనీల ప్రజలు పునరావాస కేంద్రాలకు చేరుకున్నారు. మండలానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. భద్రాచలం వెళ్ళడానికి మురుమూరు వద్ద రహదారి మునిగిన పరిస్థితి, ఇటు చింతూరు వెళ్లాలంటే పంద్రాజుపల్లి వద్ద ఆర్ అండ్ బి రహదారి మునిగి ఎటు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. శబరి పరివాహక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చీకట్లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ఆర్ అండ్ బి రహదారి వెంబడి విద్యుత్ సరఫరా ఇవ్వాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ముంపునకు గురైన విఆర్.పురం మండలం వడ్డి గూడెం కాలనీ

ముంపు గ్రామాల్లో ఎంపిపి, సిపిఎం బృందం పర్యటన

ప్రజాశక్తి-విఆర్.పురం : ముంపునకు మండలంలోని చిన్న మట్టపల్లి పంచాయతీ చింతరేగుపల్లి, శ్రీరామగిరి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం నేతలు గురువారం పర్యటించారు. అక్కడి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం నేతలు, ఎంపిపి మాట్లాడుతూ గోదావరి వరదలు వచ్చి నాలుగు రోజులు కావస్తున్నా ఇప్పటివరకు ప్రజలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నెలవారి ఇచ్చే రేషన్ బియ్యం తప్ప ప్రత్యేకంగా వరద బియ్యం పంపిణీ చేయలేదన్నారు. వరదలో మునిగి ఉన్న గృహాలను పరిశీలించి దెబ్బతిన్న ఇళ్లకు నష్టం పరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సోయం చిన్నబాబు, కారం సుందరయ్య, పంకు సత్తిబాబు, పొడియం శ్రీరామ్మూర్తి, సోడే మల్లయ్య, పండా వెంకటేష్, గొర్రె వెంకటేష్, జబ్బార్, గుడిపూడి లక్ష్మణ్, కమ్ముచిచు సత్తిబాబు, కాంతారావు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు సహాయం అందించాలి

మండలంలోని చిన్న మట్టపల్లి పంచాయతీలో ముంపునకు గురైన బాధితులకు వరద సాయం అందించాలని స్థానిక సర్పంచ్ పిట్ట రామారావు డిమాండ్ చేశారు. చింతరేగుపల్లి, కన్నాయిగూడెం, సృష్టివారిగూడెం, గుండుగూడెం ముప్పునకు గురైనట్లు చెప్పారు. కార్యక్రమంలో కోటం జయరాజు, ముత్యాల మురళి, గుటాల ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

పడవపై శ్రీరామగిరి గ్రామానికి వెళ్తున్న ఎంపిపి లక్ష్మి, సిపిఎం నాయకులు

ముందస్తు చర్యలు చేపట్టాలని సిపిఎం వినతి

ప్రజాశక్తి-కూనవరం : వరద ప్రాంతాల్లో అధికారులు పర్యటించి ముందస్తు చర్యలు చేపట్టాలని సీపీఎం ప్రజాప్రతినిధులు, ఆ పార్టీ నాయకులు స్థానిక తహశీల్దారు శ్రీనివాసరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముంపుకి గురైన గ్రామాలను గుర్తించి తక్షణమే నిత్యావసర సరుకులు అందించాలని డిమాండ్ చేశారు. శబరి పరివాహక ప్రాంతాల్లో 40 అడుగులకే విద్యుత్ సరఫరా ఆగిపోయిందని, తక్షణమే విద్యుత్ లైన్ ఆర్ అండ్ బీ రహదారి పొడువునా వేసి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, ఎంపీటీసీలు అమ్మాజీ, జయసుధ, సర్పంచ్ నాగమణి, మాజీ ఎంపీటీసీలు మేకల నాగేశ్వరరావు, పాయం సత్యనారాయణ, బాబు పాల్గొన్నారు.

కూనవరం మండలం టేకులబోరులో కూరగాయలు అందిస్తున్న కలెక్టర్

వరద ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్, ఎస్‌పి పర్యటన

ప్రజాశక్తి-కూనవరం : గోదావరి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పీ అమిత్ కుమార్ బర్దర్ మండలంలో పర్యటించారు. టేకులబోరు లోని పునరావాస కేంద్రంలో సుమారు 130 మందికి కూరగాయలు, దుంపలు పంపిణీ చేశారు. పప్పు, నూనెలు వస్తున్నాయని తెలిపారు. పునవరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులు తమకు వెంటనే ప్యాకేజీ ఇచ్చి పంపాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట సబ్ కలెక్టర్, స్థానిక తహసీల్దార్ శ్రీనివాసరావు, సర్పంచ్ హేమంత్ గాంధీ ఉన్నారు.

వడ్డి గూడెం కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎస్‌పి

విఆర్.పురం : మండలాల్లో విఆర్.పురంలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, జిల్లా ఎస్పీ అమిత్ బార్దర్, ఎఎస్పీ పంకజ్ కుమార్ మీనా పర్యటించారు. లోతట్టు గ్రామాల ప్రజలు ముందుగానే పునరవాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో ప్రజలకు అన్ని రకాల సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వారి వెంట ఎటపాక సీఐ కన్నప్ప రాజు, చింతూరు సిఐ గోపాలకృష్ణ, ఎస్సై సంతోష్ కుమార్, తహశీల్దార్ సరస్వతి, రెవెన్యూ, పోలీసు సిబ్బంది ఉన్నారు. దీనికి ముందు జిల్లా ఎస్పీ అమిత్ బద్దర్, చింతూరు ఎఎస్పి పంకజ్ కుమార్ మీనా, ఇతర పోలీసు అధికారులు ముంపునకు గురైన వడ్డిగూడెం కాలనీ సందర్శించి గ్రామ ప్రజలతో మాట్లాడారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంపిపి, సిపిఎం బృందం

విఆర్.పురం మండలంలోని శబరి గోదావరి సంగమం బ్రిడ్జి వద్ద జిల్లా కలెక్టర్‌ను ఎంపీపీ కారం లక్ష్మి, సిపిఎం నాయకులు కలిశారు. ముంపునకు గురవుతున్న గ్రామాలు ప్రజల సమస్యలను కలెక్టర్‌కు తెలియజేశారు. పునరావాస కేంద్రాలకు వెళ్లి ప్రతి ఒక్కరికీ టార్పాలిన్‌లు, కిరోసిన్, నిత్యవసర సరుకులు ఇవ్వాలని కోరారు.

వైద్య శిబిరాన్ని పరిశీలించిన ఎంపిపి

విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లగూడెం గ్రామంలో గురువారం అంగన్వాడీ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎంపీపీ కారం లక్ష్మి, పెద్ద మట్టపల్లి ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య శిబిరంలో పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు ఎప్పటికప్పుడు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల సిపిఎం నాయకులు సోయం చిన్నబాబు, పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, పొడియం శ్రీరామ్మూర్తి, సిహెచ్ సుబ్బారావు, అంగన్వాడి టీచర్ ఆయాలు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీల ఆందోళన

అరకులోయలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-అనంతగిరి: దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ మండల కేంద్రంలో సీడీపీవో కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు సీహెచ్ .కళావతి, సిఐటియు జిల్లా కార్యదర్శి కిల్లో. మోస్య మాట్లాడుతూ, పల్లుమార్లు అనేక నిరసనలు, ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు పటించుకున్న పరిస్థితి లేదని విమర్శించారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో భవిష్యత్తులో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సీడి పీవో ఎన్. సుగుణ కి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు చిలకమ్మ, శాంతి, మణి, సరస్వతి, కన్యాకుమారి, రాజేశ్వరి. తదితరులు పాల్గొన్నారు

అనంతగిరిలో...

ముంచింగిపుట్టు :: మండల కేంద్రంలో అంగన్వాడీలు, మినీ అంగన్వాడీలు, హెల్పర్లు సిఐటియు మండల కార్యదర్శి కొర్ర శంకర్రావు ఆధ్వర్యంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని అమలు చేయాలని ఐసిడిఎస్ ఇన్చార్జి సిడిపిఓ రాజేశ్వరికి వినతి పత్రాన్ని అందజేశారు.సీఐటీయూ మండల కార్యదర్శి కొర్రా శంకర్ రావు మాట్లాడుతూ, అంగన్వాడీలకు పనిభారం పెంచి ఒత్తిడికి గురి చేస్తూ వెట్టి చాకిరి చేయిస్తున్నారని ఆగ్రహించారు. అంగన్వాడీలకు ఇచ్చిన ఫోన్లు పనిచేయలేదని, ఏజెన్సీ మారుమూల ప్రాంతాల్లో నెట్వర్క్ సమస్య తీవ్రంగా ఉందన్నారు.

అంగన్వాడీ యూనియన్ మండల కార్యదర్శి ఎస్.ఈశ్వరి మాట్లాడుతూ, 42 రోజుల పాటు సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు కె.మౌలమ్మ, భవాని, గంగ భవాని, అమ్మాజీ, చిలకమ్మ, చంద్రకళ, పార్వతి అంగన్వాడి కార్యకర్తలు, మినీలు, ఆయాలు పాల్గొన్నారు.

జీకే వీధి : మండలంలోని అంగన్వాడీ వర్కర్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు)అఖిల భారత కమిటీ పిలుపు మేరకు రింతాడ సెక్టర్ పరిధిలో నిరసన చేపట్టారు. అంగనవాడి వర్కర్స్ వెల్పర్స్ యూనియన్ మండల కార్యదర్శి అప్పల నరసమ్మ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం 2014 నుండి అంగన్వాడీలకు వేతనాలు పెంచలేదన్నారు. అంగన్వాడీ సెంటర్ నిర్వహణకు ఇచ్చిన ఫోన్లు పనిచేయడం లేదన్నారు.

అంగన్వాడీ యూనియన్ మండల నాయకులు ఎస్. భవాని సావిత్రి మాట్లాడుతూ, 42 రోజుల పాటు సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ వెల్ఫేర్ తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: అరకులోయ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద అంగన్వాడి కార్యకర్తలు, నాయకులు కలిసి నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా అంగన్వాడి అధ్యక్ష కార్యదర్శులు కె రాధ,భారతి, డి నిర్మల, ట్రెజరరి పాంగి వెంకట్ లక్ష్మి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడిలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు లలిత, భవాని, శాంతి,జోగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో...

చింతూరు : ఎఫ్ఆర్ఎస్ యాప్, ఇతర యాప్‌లను రద్దు చేయాలని, వేతనాలు పెంచాలని, అన్ని మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయాలని, సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరుతూ చింతూరు ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సమ్మె కాలంలో చేసుకున్న ఒప్పందాలను అమలు చేస్తామని ఎన్నికలకు ముందుపు చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 6400 మినీ సెంటర్లు ఉండగా, 4,687 కేంద్రాలను మాత్రమే అప్‌గ్రేడ్ చేశారని, మిగిలిన 1810 సెంటర్లను కూడా మెయిన్ సెంటర్లుగా అప్ గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే మరో పోరాటం నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు సీసం సురేష్, అంగన్వాడీ నాయకులు నూకరత్నం, భద్రమ్మ, నాగమణి, జ్యోతి, ఝాన్సీ, సరస్వతి, లలిత, బుజ్జి నాని పాల్గొన్నారు.

చింతూరులో..

గంగవరం : మండల కేంద్రంలోని వై జంక్షన్ వద్ద సిఐటియు అధ్యక్షులు బేబీ రాణి ఆధ్వర్యాన అంగన్వాడీలు మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

వై.రామవరం : మండల కేంద్రంలో అంగన్వాడీలు భారీ ర్యాలీ నిర్వహించి తహశీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం తహశీల్దారు గోపాలరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు బేబీ రాణి, పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు,

గంగవరంలో...

సీలేరు : జీకే వీధి మండలం దారకొండలో గురువారం అంగన్వాడీ వర్కర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షురాలు ఎల్ సత్యవతి, ఎస్.ఈశ్వరి, మీనాక్షి, యశోద, అంగన్వాడీలు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

జికె.వీధిలో...

వై. రామవరంలో...

హాస్టల్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

-సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నయ్య పడాల్

ప్రజాశక్తి-చింతపల్లి: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో పని చేస్తున్న వర్కర్లు, స్వీపర్లకు తక్షణమే బకాయి పడ్డ జీతాలు విడుదల చేయాలని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పలు హాస్టళ్లను సందర్శించి వసతి గృహ కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, అల్లూరి జిల్లా వ్యాప్తంగా ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న క్యాజువల్, డైలీవెజ్, ఔట్సోర్సింగ్, బాత్రూం స్వీపర్లకు మూడు నెలల నుంచి జీతాలు లేక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్కర్ల చేత పని చేయించుకుంటున్న అధికారులు జీతాలు ఇచ్చే విషయం గుర్తుండదా అని ప్రశ్నించారు. కార్మికుల జీతాలు ఈ నెలాఖరులోగా చెల్లించకపోతే సెప్టెంబర్ మొదటి వారంలో చలో ఐటిడిఏ నిర్వహిస్తామని హెచ్చరించారు. హాస్టల్ వర్కర్లు సోములమ్మ, లక్ష్మణరావు, కొండమ్మ, ఎస్ కే బీబీ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి

ఉద్యోగ విరమణ మరియు షష్టిపూర్తి శుభాకాంక్షలు

అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.

మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు

మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.

ఉద్యోగ విరమణ షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు

మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	9490099125	పూర్ణమార్కెట్	9490099676
మధురవాడ	8008596645	జగదాంబ	9490099434
గాజువాక	9849392359	జివియంసి	9490099483
అనకాపల్లి	8008736188	ద్వారకానగర్	9490099672
చోడవరం	9490099141	కంచరపాలెం	9490099135
నర్సీపట్నం	9440280411	మాదవధార	9490099675
పాడేరు	9490099142		
రంపచోడవరం	9440165617		

మాట్లాడుతున్న బాబూరావు

మలేరియా నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి -అనంతగిరి:మలేరియా మరణాలు నిర్మూలించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మలేరియా యూనిట్ ఆఫీసర్ .బాబురావు అన్నారు. మండలంలోని కాశిపట్నం. సచివాలయంలో గురువారం గ్రామీణ వైద్యులు, హెల్త్ అసిస్టెంట్‌లతో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాబురావు. మాట్లాడుతూ, మలేరియాతో బాదపడుతున్న వారు మందులను క్రమంగా వాడకపోవడంతో వ్యాధి విజృబించి మరణాలు సంబవిస్తున్నాయన్నారు. పరిసర ప్రాంతాలలో నీటి నిల్వ లేకుండా చూడాలని, దోమతెరలు వాడాలన్నారు. గ్రామీణ వైద్యులు మలేరియా లక్షణాలు కలిగిన వారిని స్థానిక పీహెచ్సీకి పంపి వారికి ఇచ్చిన మందులను సక్రమంగా వాడేవిధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా టెక్నికల్ ఆఫీసర్ రామచంద్రరావు, మలేరియా సూపర్వైజర్ దొర, పెనుకోట పిహెచ్సి సూపర్వైజర్ రామకృష్ణ, ఉత్తరాంధ్ర ఆర్.ఎం.పి గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్ష కార్యదర్శి. జంగం జోషి, చిరంజీవి, ఏ ఎస్ ఆర్ జిల్లా కార్యదర్శి. కరకవలస. నాగేష్, అడ్వైజర్. కోనా ప్రకాష్, యూత్ వింగ్ ఇంచార్జ్ ఉంగరాల ఈశ్వరరావు, మండల గ్రామీణ వైద్యులు. మహేష్, సూరిబాబు, బాబురావు, కవిత, నారాయణరావు పాల్గొన్నారు

లబ్ధిదారులతో మాట్లాడుతున్న సర్పంచ్ చిన్నబాబు

పిఎం జన్మన్ లబ్ధిదారులకు నగదు జమ చేయాలి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:పీఎం జన్మన్ కింద పెంచిన లక్ష రూపాయలు లబ్ధిదారుల ఖాతాలో జమ చేయాలని సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెల చిన్న బాబు డిమాండ్ చేశారు. అరకులోయ మండలం సుంకరమెట్ట పంచాయితీ, పెదగంగుడి, సంఘం వలస గ్రామంలో పర్యటించి పీఎం జన్ మన్ లబ్ధిదారులతో మాట్లాడుతూ సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిన్నబాబు మాట్లాడుతూ, బిల్లులు పెట్టి నెల రోజులు కావస్తున్నా లబ్ధిదారుల ఖాతాలో డబ్బులు జమ కాక పోవడంతో ఇల్లు నిర్మాణాల్లో జాప్యం జరుగుతుందని తెలిపారు. బిల్లులు సకాలంలో అందక లబ్ధిదారులు ఇల్లులు నిర్మించుకోలేకపోతున్నారని తెలిపారు. జన్ మాన్ ద్వారా ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ప్రస్తుతం ఇల్లు నిర్మాణ సామాగ్రి ధరలు పెరగడంతో దానికి అనుగుణంగా ఒక్కో ఇల్లు నిర్మాణానికి 5 లక్షల పెంచాలని డిమాండ్ చేశారు. బిల్లులు పెట్టి నెలలు కావస్తున్న డబ్బులు జమ కాకపోవడంతో నిర్మాణాలు పూర్తి చేయలేకపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

టెండర్ పాట నిర్వహించాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో వాహనాల పార్కింగ్ టికెట్ వసూళ్లకు టెండర్ పాట నిర్వహించాలని వైసీపీ పోతంగి పంచాయతీ అధ్యక్షుడు కె విజయదశమి డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గతంలో చాపరాయి జలపాతం పర్యాటకుల ప్రవేశాలకు టెండర్ పాట నిర్వహించడంతో పంచాయతీకి నిధులు వచ్చేదని చెప్పారు. ఐటిడిఏ తీసుకోవడంతో పంచాయితీకి నిధులు రాలేదని, తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి టెండర్ పాట నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పాఠశాలలో తనిఖీలు

ప్రజాశక్తి- పెదబయలు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక జడ్పీటీసీ కూడా బొంజుబాబు గురువారం మధ్యాహ్నం తనిఖీలు చేసారు మధ్యాహ్న భోజన పథకం మెనూ అమలు తీరును పరిశీలించారు. పాఠశాల ఉపాధ్యాయుల పనితీరును అడిగి తెలుసుకొన్నారు జడ్పీటీసీతో పాటు రాజీ సర్పంచ్ పాంగి సింహాచలం ఉన్నారు.

అరకు కెకె లైన్లో పనిచేస్తున్న...

కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకు కేకే రైల్వే లైన్లో పనిచేస్తున్న ట్రాక్ మెయింటెనెన్స్ కార్మికులు, స్టేషన్ల శానిటేషన్, ఇతర విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు జిఓ ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహులు కోరారు. గురువారం ఆదివాసి గిరిజన సంఘం భవనంలో సిఐటియు ఆధ్వర్యంలో యూనియన్ కార్యదర్శి సన్యాసిరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహులు మాట్లాడారు.రైల్వే బోర్డు జారీ చేసిన జిఓ ప్రకారం కనీస వేతనాలు కాంట్రాక్ట్ కార్మికులకు తప్పనిసరిగా చెల్లించాలన్నారు. పిఎఫ్,ఈఎస్ఐ వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, కాంట్రాక్టర్లు చట్ట ప్రకారం ఇవి చెల్లించకుండా ఎగ్గొడుతున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా రైల్వే లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను ఒక్క తాటిమీదకు తీసుకొచ్చి భవిష్యత్తులో కార్మికుల ఉద్యోగ భద్రత కోసం పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నట్లు తెలిపారు.

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, అరకు కేకే లైన్లో పనిచేస్తున్న కార్మికులందరూ వెనకబడిన గిరిజనులని, చులకన భావంతో కాంట్రాక్టర్లు కార్మికుల శ్రమను దోచేస్తున్నారన్నారు. వేతనాల్లో కోత విధిస్తున్నారని తెలిపారు. ఒరిస్సా ప్రాంతంలో ఉన్న రాయగడ డివిజన్ ఏరియాలో పనిచేస్తున్న ట్రాక్ మెయింటెనెన్స్ కార్మికులకు కాంట్రాక్ట్ మారితే పాతవారిని తొలగించి కొత్తవారిని పెడుతున్నారని, ఇది చట్ట విరుద్ధమని తెలిపారు. సంవత్సరం పూర్తిగా ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. సేఫ్టీ మెటీరియల్స్ సప్లై చేయాలని డిమాండ్ చేశారు.రైల్వే కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని యూనియన్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు చిట్టిబాబు, దిలీప్, సమర్ధి రాజు, కుర్రా అర్జున, అశోక్ కుమార్, అరుణ్ కుమార్, రవీంద్ర, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నరసింహులు

సహకార సంఘాల అభివృద్ధికి కృషి

పాడేరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఈశ్వరి

మాట్లాడుతున్న ఈశ్వరి

ప్రజాశక్తి- చింతపల్లి:సహకార సంఘాలను అభివృద్ధి బాటలో నడిపించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పాడేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తెదేపా పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వరి అన్నారు. గురువారం చింతపల్లి అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ సొసైటీలో ఏర్పాటైన సొసైటీ చైర్మన్ పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో ఆమె రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు గోవింద్ మాస్టర్ తో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు చింతపల్లి అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ గా నియమితులైన గెమ్మెలి అబ్బాయి నాయుడు, డైరెక్టర్ సుర్ల అప్పలకొండకు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గత ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం కారణంగా సొసైటీలు నిర్వీర్యానికి గురై రైతులకు రుణాలు, పంట ప్రోత్సాహ నిధులు అందకుండా పోయాయన్నారు. వారి అసమర్ధతతో ఆ సహకార సంఘానికి సుమారు కోటి రూపాయల వరకు నష్టం వాటిల్లిందని అన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి తెదేపా మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, గ్రామ కమిటీ అధ్యక్షులు రీమల ఆనంద్, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, అరకు పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షులు నాగభూషణం, కొయ్యూరు మండల మహిళా అధ్యక్షురాలు బోనంగి సత్యవతి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గోలి దేవి పాల్గొన్నారు.

కాలువలో పూడికతీత పనులు

ప్రజాశక్తి-చింతపల్లి

మండలంలోని పెదబరడ పంచాయతీలో మురుగు నీటి కాలువల పూడికతీత పనులను గురువారం సర్పంచ్ సమిడి గోపాల్ ఆధ్వర్యంలో చేపట్టారు. లోతుగడ్డ జంక్షన్, పెదబరడ పంచాయతీ కేంద్రంలోని మురుగు కాలువలలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోపాల్ మాట్లాడుతూ,గ్రామ ప్రజలు కాలువల్లో చెత్త వేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మి కుమార్, వార్డు సభ్యులు రామచందర్, గ్రామస్తులు పిండి రమణ, సూరిబాబు పాల్గొన్నారు.

జెసిబితో కాలువల్లో చెత్త తొలగింపు

వినాయక మండపాలకు అనుమతి పొందాలి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:వినాయక చవితి సందర్భంగా మండపాల ఏర్పాటు ఆన్లైన్లో నిర్వాహకులు అనుమతులకు దరఖాస్తులు చేసుకోవాలని అరకు సిఐ ఎల్ హిమగిరి తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, అరకు సర్కిల్ పరిధి మండలాలు అరకువేలి, డుంబ్రిగూడ, అనంతగిరి మండల పరిధిలో వినాయక చవితి మండపాలు ఏర్పాటు చేసుకునేందుకు పోలీసులు అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని సూచించారు. వినాయక చవితి మండపాల ఏర్పాటు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని ఎస్పీ ఆదేశాల ఇచ్చారన్నారు.అడ్రస్, మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, కమిటీ సభ్యులు ఫోన్ నెంబర్లు, నిమజ్జనం తేదీ విషయాలు దరఖాస్తు చెయ్యగానే సంబంధిత పోలీసు అధికారి మండపం ప్రాంతాన్ని పరిశీలించి క్యూఆర్ కోడ్ తో కూడిన ఎన్ఓసి జారీ చేస్తారన్నారు.అంతట ఆన్లైన్ నుంచే నేరుగా ఎన్ఓసి డౌన్లోడ్ చేసుకుని మండపం ఏర్పాట్లు చేసుకోవచ్చు అని తెలిపారు. నిమజ్జనం సమయంలో ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగించకూడదని తెలిపారు.

పెదబయలు:మండలంలో వినాయక చవితి పండుగ మండపాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని స్థానిక ఎస్ఐ కె రమణ గురువారం పేర్కొన్నారు. మండపాలకు అనుమతులు ఇచ్చే విధానంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఉండేలా ఓ వెబ్‌సైట్‌ను రూపొందించడం జరిగిందన్నారు. సింగిల్ విండో విధానంలో ఆన్‌లైన్‌లో అప్లై చేసి అనుమతులు పొందవచ్చన్నారు. వివరాల కోసం మొబైల్: 9440904227 సంప్రదించాలన్నారు.

పండుగ వస్త్రాల సంబరం

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : రాబోయే పండుగలు, వివాహాది వేడుకల కోసం ప్రత్యేక వస్త్రాల ప్రదర్శన, అమ్మకాలను స్థానిక గ్రీన్ పార్కు హోటల్ మెయిన్ రోడ్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్ పోను గురువారం ప్రారంభించారు. ఈ ప్రదర్శన ఈ నెల 26వ తేదీ వరకు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. వినాయక చవితి దసరా, వివాహాది వేడుకలకు అవసరమైన సంప్రదాయ, ఆధునిక ఫ్యాషన్లు సమ్మిళితమైన విభిన్న వస్త్రాలను ఈ ప్రదర్శనలో ఉంచినట్లు పేర్కొన్నారు. నేషనల్ సిల్క్ ఎక్స్‌పో - ఎగ్జిబిషన్ కమ్ సేల్‌లో విభిన్న ప్రాంతాల సాంప్రదాయ వస్త్రాలను, ఉత్పత్తులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ ప్రదర్శన ప్రతి రోజూ ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్థానిక సమత కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ద ప్లేస్మెంట్ పార్క్, కాన్సెంట్రిక్స్, హుందాయి, ఐఫోన్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్, ష్నైడర్ ఎలక్ట్రిక్, డబ్ల్యూఎన్ఎస్ గ్లోబల్ సర్వీసెస్, హెటిరో, డిక్సన్, ప్రీమియర్, యోకో హమా, టాటా ఎలక్ట్రానిక్స్, డెక్కన్, జాబ్ డీలర్స్, వెల్డన్ మార్కెటింగ్ ఏజెన్సీస్, కియా, జయభేరి తదితర సుమారు 18 మల్టీ నేషనల్ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. సుమారు 522 మంది విద్యార్థులు హాజరు కాగా, 264 మంది కంపెనీల నుంచి అర్హత పత్రాలు పొందారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్, కరస్పాండెంట్ ప్రొఫెసర్ ఎస్.విజయరవీంద్ర, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి.శ్రీనివాసరావు, ప్లేస్మెంట్ ఆఫీసర్ పూర్వీ గుప్తా పాల్గొన్నారు.

గెలాక్సీ ట్యాబ్ యాక్టివ్ 5విడుదల

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : సామ్‌సంగ్ గెలాక్సీ ట్యాబ్ యాక్టివ్ 5 ఎంటర్‌ప్రైజ్ ఎడిషన్‌ను గురువారం విశాఖలో విడుదల చేసింది. ఇది అధిక-తీవ్రత వాతావరణంలో పనిచేసే వ్యాపార సంస్థలు, నిపుణులను శక్తివంతం చేయడానికి రూపొందించబడిన దఢమైన, ఎంటర్‌ప్రైజ్-రెడీ టాబ్లెట్ అని సామ్‌సంగ్ ఇండియా ఎంటర్‌ప్రైజ్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ పునీత్ సేథి తెలిపారు. ఉన్నత స్థాయి పనితీరుతో, రక్షణ, ప్రజా భద్రత, లాజిస్టిక్స్, తయారీ, ఆరోగ్య సంరక్షణ, రిటైల్, సేవలు వంటి డిమాండ్ ఉన్న, కఠినమైన రంగాల అవసరాలను తీరుస్తుందని ఆయన వివరించారు. ఈ నూతన గెలాక్సీ ట్యాబ్ యాక్టివ్ 5 ఎంటర్‌ప్రైజ్ ఎడిషన్ 8.0 అంగుళాల (20.32సెం.మీ) హై-రిజల్యూషన్ డిస్‌ప్లేను 120 హెచ్ జెడ్ రిఫ్రెష్ రేట్‌తో కలిగి ఉందని, ఇది ఆక్టా-కోర్ ప్రాసెసర్ ద్వారా సున్నితమైన మల్టీ టాస్కింగ్, అధిక-ఇంటె న్సిటీ వర్క్‌లోడ్‌ల కోసం శక్తినిస్తుంది, 6 జీబీ /128 జీబీ, 8 జీబీ /256జీబీ వేరియబుల్ మెమరీ ఎంపికలతో ఉంటుందని వివరించారు.

సికిల్ సెల్ జన్యు పరీక్షల కేంద్రం ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సికిల్ సెల్ ఎనీమియాతో బాధపడుతున్న అత్యధిక శాతం గిరిజన పిల్లలు, పెద్దల జన్యు పరీక్షల కోసం, వ్యాధి స్థాయిని అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వ గిరిజన సంక్షేమశాఖ సారధ్యాన రూ.4 కోట్లతో కెజిహెచ్‌లో 3 నెలల్లో వైద్య పరీక్షల కేంద్రం సెంటర్ ఆఫ్ కాంపిటెన్స్ కేంద్రం ఏర్పాటుకు ఆమోదం తెలపడం అభినందనీయమని చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం తెలిపారు.

మార్గదర్శులు, బంగారు కుటుంబాల గుర్తింపు

వేగవంతం చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్

ప్రజాశక్తి-రంపచోడవరం:మార్గదర్శులు, బంగారు కుటుంబాలను గుర్తింపు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్ ఆదేశించారు. రంపచోడవరం నుండి జిల్లా కలెక్టర్ గురువారం జిల్లాలోని అన్ని మండలాల స్పెషల్ ఆఫీసర్‌లు, ఎంపిడిఓలు, తహాశీల్దార్లతో, వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నేటికీ నమోదైన మార్గదర్శులు, బంగారు కుటుంబాల వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారీగా బంగారు కుటుంబాల వివరాలు సిద్ధం చేయాలన్నారు. దీనికి మండలం ప్రత్యేక అధికారి పూర్తి బాధ్యత వహించాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారి, తహసీల్దారులు, ఎంపిడిఒలు సమన్వయంతో పనుల పురోగతి కావాలన్నారు. సచివాలయం ద్వారా ఎన్రోల్ వేగవంతం చేయడం జరుగుతుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్ గౌడ్, రంపచోడవరం, చింతూరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారులు కె.సింహాచలం, అపూర్వ భరత్, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్, పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమన్, (వర్చువల్), పాడేరు కలెక్టరేట్ నుండి జిల్లా రెవిన్యూ అధికారి పద్మాలత, జిల్లా పి4 ప్రత్యేక అధికారి, ప్రత్యేక ఉప కలెక్టర్ ఎంవిఎస్.లోకేశ్వరరావు, డిజిపిఓ కెపి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన


విద్యార్థులకు వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్ఐ చిట్టిబాబు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని జడ్డంగి పోలీస్ స్టేషన్ పరిధిలోని బోర్నగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాలలో విద్యార్థులకు జడ్డంగి ఎస్ఐ చినబాబు గురువారం చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ చినబాబు మాట్లాడుతూ విద్యార్థులకు గంజాయి వ్యసనం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. అటువంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆశక్తి కనబరచాలని సూచించారు. అనంతరం విదాక్యర్థులకు వాలీబాల్ కిట్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

100 పడకల ఆసుపత్రి ఆధునికీకరణపై హర్షం

ప్రజాశక్తి-కూనవరం : చింతూరు సిహెచ్‌సిని 100 పడకల హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చెయ్యడానికి కేబినెట్ ఆమోదం తెలిపడంపై స్థానిక టీడీపీ నాయకులు గడేసుల రంజిత్ కుమార్, గడ్డిపాటి ప్రసాద్, కొక్కిరేణి ఆదినారాయణ, నోముల సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రంపచోడవరం ప్రజల కోసం మరిన్ని అభివృద్ధి సంక్షేమ సామజిక సేవ ఇలా అన్నింటిలో ముందుండాలని కోరారు.

ధారకొండ మండలం ఏర్పాటు చేయాలి

పజాశక్తి-సీలేరు : జిల్లాలోని ధారకొండ కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలని మండల సాధన కమిటీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం వారు జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడు, ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి గిడ్డి ఈశ్వరి, జనసేన నాయకులు గంగులయ్య తదితరులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు విష్ణుమూర్తి, మార్కు రాజు, సీలేరు సర్పంచి పాంగి దుర్గో, చిటికెల రాము మాట్లాడుతూ దారకొండ మండల కేంద్రంగా చేస్తే ఆరు పంచాయతీలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు.

దీనికి జాయింట్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. సీలేరు, దుప్పిలివాడ, దారకొండ, గుమ్మిరేవులు, ఏ దారకొండ, గాలికొండ పంచాయతీల పరిధి గ్రామాల్లో ప్రజలకు కనీసం మౌలిక వసతులు ఇప్పటికీ పూర్తిస్థాయిలో లేవని కొన్ని గ్రామాల్లో పాఠశాలలు లేవని, మరికొన్ని గ్రామాల్లో పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులు నేటికీ లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లి దారకొండ మండల కేంద్రంగా ప్రకటించాలని వినతి పత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ, జగన్, సుందరయ్య, ఉమామహేశ్వరరావు, ఎం.సుధాకర్, ఆరు పంచాయతీల నాయకులు పాల్గొన్నారు.

జెసికి వినతిపత్రం ఇస్తున్న సాధన కమిటీ నేతలు

మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి వినతిపత్రం ఇస్తున్న సాధన కమిటీ నేతలు

ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు వినతిపత్రం అందజేత

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్.కె.రత్న మాణిక్యం గురువారం ఒక ప్రకటనలో కోరారు. 2025-26 విద్యా సంవత్సరానికి డిగ్రీలో ప్రవేశానికి నమోదు ప్రక్రియ ప్రారంభమైనదన్నారు. ఇంటర్మీడియట్ లేదా తత్సమాన విద్యార్హతలు గల విద్యార్థులు ఆన్‌లైన్ వెబ్ కౌన్సిలింగ్ ద్వారా అడ్మిషన్లు పొందాలని సూచించారు. ఆన్ లైన్ అడ్మిషన్స్ ప్రక్రియ కళాశాలలో ఉచితంగా చేస్తున్నట్లు చెప్పారు. బిఏ (ఎకనామిక్స్), బిఏ (పొలిటికల్ సైన్స్), బికామ్ (కంప్యూటర్ అప్లికేషన్స్), బికామ్ (జనరల్), బిఎస్సీ (కెమిస్ట్రీ), బి.ఎస్సీ (కంప్యూటర్ సైన్స్), బిఎస్సీ (మ్యాథమెటిక్స్), బిఎస్సీ (జువాలజీ) తదితర కోర్సులు కళాశాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 26వ తేదీలోగా ఆన్లైన్లో నమోదు చేసుకోవాలన్నారు. 24-28 మధ్య వెబ్ ఆప్షన్స్‌కు, వెబ్ ఆప్షన్స్ మార్పుకు ఆగస్టు 29న, సీట్ల కేటాయింపు ఆగస్టు 31న ఉంటాయని పేర్కొన్నారు. సెప్టెంబర్ ఒకటి నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, మరిన్ని వివరాలకు 9701506541, 994969388 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

సచివాలయాల్లో సిబ్బందిని నియమించాలని వినతి

ప్రజాశక్తి-కూనవరం : సచివాయాల్లో సిబ్బంది లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే సిబ్బందిని నియమించాలని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సిపిఎం ప్రజాప్రతినిధులు, నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. సిబ్బంది లేక ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తు చేయక మండల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అన్ని విభాగాల సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, ఎంపీటీసీలు అమ్మాజీ, జయసుధ, సర్పంచ్ నాగమణి, మాజీ ఎంపీటీసీ మేకల నాగేశ్వరరావు, పాయం సత్యనారాయణ, బాబు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న సిపిఎం ప్రజాప్రతినిధులు

ముగిసిన ఆదికర్మ యోగి శిక్షణ

శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలో గిరిజనుల గ్రామాలు అభివృద్ధి నిమిత్తం ఈనెల 19 నుండి 21వ తేదీ వరకు ఆది కర్మయోగి కార్యక్రమం ద్వారా మండల స్థాయి అధికారులకు నిర్వహించిన శిక్షణ గురువారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, రంపచోడవరం ఐటీడీఏ కట్టా సింహాచలం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ శిక్షణ పొందిన మండల స్థాయి మాస్టర్ ట్రైనర్లు గ్రామస్థాయిలో కొంతమందికి ఆది కర్మయోగి శిక్షణ ఇచ్చి ఎంపిక చేసిన గ్రామాలలో ప్రజల ప్రాధాన్యత ఆధారంగా విద్యా, వైద్యం, తాగునీరు, పారిశుధ్య, రహదారులు తదితర అంశాలపై యాక్షన్ ప్లాన్ రూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డిఎన్వి రమణ. జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్లు జి.శారదా దేవి, చంద్ర కిరణ్, శిరీష, రామం, అచ్యుత్ కిరణ్, ధ్రువకుమార్, అన్ని మండలాల ఎంపీడీవోలు, వైద్యాధికారులు, ఇంజనీర్లు, సిడిపివోలు, ఎంఇఒలు, సహాయ గిరిజన సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పాత్రికేయునికి ఆర్థిక సాయం

విజయ్‌కుమార్‌ను పరామర్శిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని జడ్డంగి గ్రామానికి చెందిన జిల్లావాణి విలేఖరి ముడుసు విజయ్ కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స అనంతరం ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో గురువారం అతనిని టీడీపీ మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు, ఇతర నేతలు పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నేతలు చెక్క లోవరాజు, సుంకర ప్రసాదు ప్రెస్ క్లబ్ సభ్యులు ఉన్నారు.

సాగర్‌నగర్ బీచ్ సుందరీకరణపై సమీక్ష

సాగర్‌నగర్ బీచ్ సుందరీకరణపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-మధురవాడ : సాగర్ నగర్ బీచ్ అభివృద్ధికి త్వరితగతిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. ఎంవిపి కాలనీలోని క్యాంపు కార్యాలయంలో సాగర్‌నగర్ బీచ్ సుందరీకరణ, ఈట్ స్ట్రీట్ నిర్మాణంపై జివిఎంసి జోన్ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. రామకృష్ణా బీచ్, రుషికొండ బీచ్ లకు ధీటుగా సాగర్ నగర్ బీచ్‌కు టూరిస్టులు వస్తున్న నేపథ్యంలో అందర్నీ ఆకర్షించేలా తీర్చిదిద్దేందుకు పనులు ప్రతిపాదించాలన్నారు. రూ. 16 కోట్లతో 800 మీటర్ల పొడవున సాగర్‌నగర్ బీచ్ సుందరీకరణపై అటవీ అధికారులతో సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. సాగర్ నగర్ బీచ్ రోడ్ జంక్షన్‌లో రూ.3 కోట్లతో నిర్మించనున్న ఈట్ స్ట్రీట్‌లో 18 స్టాల్స్ లో 220 మంది కూర్చునే సౌకర్యం ఉండేలా ప్రణాళిక రూపొందించామని వెల్లడించారు. సమావేశంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, జోన్ -1 ఇఇ శాంతిరాజు, డిఇఇ. టి.మణికుమార్, కన్సల్టెంట్ ఆదిత్య పాల్గొన్నారు.